

సీతంపేటలో పార్వతీశ్వరుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు


సాయినగర్‌లో శివయ్యకు పూజలు


లలితా పీఠంలో అఘోర గౌరీ మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు


గణేష్‌నగర్ శివాలయ పూజల్లో పాల్గొన్న భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న మాధవధార మాధవ స్వామి ఆలయం

శంభో శంకర

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు
- అంతటా మార్మోగిన శివ నామస్మరణ
- భక్తులతో పోటెత్తిన శివాలయాలు

సీతంపేట: హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ శివ నామస్మరణ అంతటా మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం, శని త్రయోదశి, మాసశివ రాత్రి అన్నీ ఒకే రోజు కలిసి రావడంతో శనివారం వేకువజాము నుంచి నియోజకవర్గంలోని శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. పార్వతీపతి దర్శనం కోసం ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. అర్చనలు, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకాలతో శివయ్యను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ ధ్వజ స్తంభాల వద్ద మహిళలు దీపారాధనలు చేశారు.

పార్వతీశ్వరాలయంలో..
సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్ పార్వతీశ్వరుడికి పూజలు చేశారు. శనివారం రాత్రి రుద్రాభిషేకాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. లింగోద్భవకాలంలో శివలింగానికి బియ్యంతో అభిషేకించారు. ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


పార్వతీశ్వరుడిని దర్శించుకుంటున్న కె.కె.రాజు

రామలింగేశ్వరాలయంలో..
రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం, అక్కయ్యపాలెంలోని జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీపరమేశ్వరుల ఆలయం, శంకరమఠం భక్తులతో పోటెత్తాయి. వేకువజాము నుంచి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, రాత్రి మహాన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు.

లలితా పీఠంలో..
లలితానగర్ లలితా పీఠంలోని అమ్మవారి సన్నిధిలో తెల్లవారు 5 గంటల నుంచే రుద్రాభిషేకం నిర్వహించారు. పండితుల వేద మంత్రాల మధ్య అఘోర గౌరీ మృత్యుంజయ హోమం చేశారు. రాత్రి కాశీ కాలభైరవులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపారు. భక్తులు పీఠంలోని శివలింగానికి జల క్షీరాభిషేకాలు చేశారు. శని త్రయోదశి కావడంతో శనిగ్రహ పూజలు నిర్వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


తిక్కవానిపాలెం విశ్వేశ్వరాలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

పోటెత్తిన భక్తులు
సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈవో శేఖర్‌బాబు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, అర్చకులు రామారావు శర్మ, మహేష్ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

➡ 14వ వార్డు గణేష్‌నగర్ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో ప్రధాన అర్చకుడు ఏడిద గురునాథ్ శర్మ బృందం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు చేశారు. ఆలయ అధ్యక్షుడు టి.ఎ స్.ఎస్.మూర్తి, కమిటీ సభ్యులు ప్రకాశరావు, బి.కె. నాయుడు, జి.కృష్ణ, ఎం.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.


నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వరాలయంలో భక్తుల రద్దీ

రామలింగేశ్వరాలయంలో..
తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం రామచంద్రనగర్‌లోని రామలింగేశ్వరాలయంలో ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తైనాల విజయ్‌కుమార్ దంపతులు శివరాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయన చేతుల మీదుగా అభిషేకాలు, పూజలు చేయించారు. ఈ శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ పాల్గొన్నారు.

కంచరపాలెం ఆలయాల్లో..
కంచరపాలెం: కంచరపాలెంలోని గౌరీ శంకరాలయం, యల్లబిల్లివారి వీధిలోని గౌరీశంకర పంచాయతన ఆలయం, తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం, ఇందిరానగర్ లక్ష్మీగణపతి ఈశ్వరరాలయం, ధర్మానగర్ బీవస్‌టీవస్ కాలనీలోని హేరంబ కోదండ ఉమామహేశ్వరాలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు, శివపార్వతుల కల్యాణోత్సవాలు నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమాలతో భక్తులంతా అర్ధరాత్రి జాగరణ చేశారు.

మాధవధార ఆలయంలో..
మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవ స్వామి ఆలయంలో మల్లికార్జున స్వామికి శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ జలధార వద్ద భక్తులు స్నానమాచరించి, శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సింహాచలం దేవస్థానం పండితుల పర్యవేక్షణలో ప్రత్యేక అభిషేకాలు జరిపినట్టు ఆలయ ప్రధాన అర్చకుడు నేదునూరి శ్రీనివాస శర్మ తెలిపారు. మహాశివరాత్రితోపాటు శని త్రయోదశి కూడా కావడంతో సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి భక్తులు తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో స్వామిని పూజించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

➡ 51వ వార్డు గాంధీనగర్‌లోని పార్వతీ సమేత అమృతలింగేశ్వర స్వామివారి స్పటిక లింగాన్ని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. మెట్ట దమయంతి, శ్యామ్, గణేష్, వినోద్ స్వామిని దర్శించిన వారిలో ఉన్నారు.

➡ 53వ వార్డు సాయినగర్‌లోని కాశీవిశ్వేశ్వరాలయంలో ధర్మకర్తల మండలి పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు అందుకూరి శివాజీ శర్మ విశేష పూజలు చేశారని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. శనివారం రాత్రి 9 నుంచి 12 గంటల వరకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో ఆలయ శిఖరంపై జ్యోతి వెలిగించారు. ఆ సమయంలో సుమారు 1,500 నుంచి 2,000 మంది వరకు భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ


భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు స్వామికి అభిషేకాలు, 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. బాలగంగాధర్-శ్రీదేవి, శివరామప్రసాద్-కనకశ్రీ దంపతుల ఆర్థిక సాయంతో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతుల సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

6 కేజీల గంజాయి స్వాధీనం

- రిమాండ్‌కు ముగ్గురు వ్యక్తులు

మద్దిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తుల నుంచి 6 కేజీల గంజాయిని శనివారం ఐదో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా.. కంచరపాలెం రైతుబజార్ వద్ద సమాచారం మేరకు ఎస్‌ఐ షేక్ సమీర్ వాహన తనిఖీలు చేస్తుండగా.. సిమ్మ మణికంఠ, పుక్కల అవినాష్, పట్నాల మోసి అని ముగ్గురు వ్యక్తులను పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మూడు ప్యాకెట్లలో 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సిమ్మ మణికంఠపై గతంలో రౌడీ షీట్ ఉందని ఎస్‌ఐ తెలిపారు.

ధ్యాన మందిరంలో భక్తి గీతాలాపన


గల్లా చిట్టిబాబును సత్కరిస్తున్న ధ్యాన మందిర కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శివుడికి, నాగసుబ్రహ్మణ్యస్వామికి భక్తు ల స్వహస్తాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం 6 నుంచి ఆదివారం ఉదయం వరకు అభిషేకం, భక్తి గీతాలాపన(బాబా భజన) కార్యక్రమాలు చేపట్టారు. గల్లా చిట్టిబాబు బృందం నిర్వహించిన భక్తి గీతాలాపన భక్తులకు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయనను ధ్యాన మందిర కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

మానసిక ప్రశాంతతే పెద్ద సంపద

ఏయూక్యాంపస్: ప్రపంచ దిశ దశను మార్చగల సత్తా యువతకే ఉందని సహజ యోగ ప్రతినిధి నేషనల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు రమేశ్ అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో నిర్వహిస్తున్న మాతాజీ నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు యువశక్తి విభాగం ఆధ్వర్యంలో యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేడు యువత పెడతోవ పట్టడానికి గల కారణాలను సహజ యోగ ప్రతినిధులు వివరించారు. యువత చక్కని లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరేందుకు క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలన్నారు. యువత పోషించే పాత్ర పైనే ఆ దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా కొణతాల

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొణతాల వెంకట అప్పారావు(శ్రీనివాస్) కాంగ్రెస్ తరఫున బరిలో దిగుతున్నారు. పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన శనివారం ఈ మేరకు తీర్మానించారు.

వైభవంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

కోలాహలంగా తాటిచెట్లపాలెం పరస


ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


ఆలయ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల సుందర అభయాంజనేయ స్వామి ఆలయ 25వ వార్షికోత్స వం శనివారం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా సాయంత్రం తాటిచెట్లపాలెంలో ఏర్పాటు చేసిన పరస మహోత్సవం ఉత్సాహంగా సాగింది. వేకువజాము నుంచి ఆలయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, విశాఖపట్నం-కాకినాడ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ చైర్‌పర్సన్ చొక్కా కుల లక్ష్మీవెంకటరావు, 45వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం పరసలో నిర్వహించిన రేలా రే రేలా, ఆటా పాటా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కమిటీ సభ్యులకు సత్కారం : సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో 25 ఏళ్లుగా విశేష సేవలందించిన పూర్వ, ప్రస్తుత కమిటీ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత పి.విష్ణుకుమార్‌రాజు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పలిశెట్టి అప్పన్న తదితరులు పాల్గొన్నారు. శివరాత్రి పర్వదినం కావడంతో పరసలో దుకాణాల వద్ద జనం సందడి చేశారు.

ఆర్కియాలజీ ఏడీని సస్పెండ్ చేయాలి

సీతంపేట: ప్రముఖ బౌద్ధ క్షేత్రం తొట్లకొండలో బౌద్ధేతర గుడి నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని బుద్దిస్టు మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి వెంకటరమణ, కో కన్వీనర్ ఎం.మల్లయ్యరాజు తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బౌద్ధ దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ గుడిని తొలగించారు కానీ అలాంటి నిర్మాణం ఏమీ జరగలేదంటూ ఆర్కియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వెంకటరావు అబద్ధపు ప్రచారం చేస్తున్నరని ఆరోపించారు. తొట్లకొండపై బౌద్ధేతర గుడి నిర్మించారనే ఆధారం ఉన్నప్పటికీ వాటిని మాయం చేయడానికి ఆయనే కారణమన్నారు. తక్షణమే ఏడీని విధులు నుంచి తొలగించి సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

అర్హులందరికీ టిడ్కో ఇళ్లు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో నూతనంగా నిర్మించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో శనివారం కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు సమావేశమయ్యారు. ఈ ప్రాంతంలో లబ్ధిదారులందరికీ ఇళ్ల కేటాయించాలని వీరు కార్పొరేటర్‌ను కోరారు. లబ్ధిదారుల జాబితాలను పరిశీలించేందుకు సర్వేకు విచ్చేస్తున్న అధికారులకు లబ్ధిదారులు సహకరించాలని, ఈ ప్రాంతంలో నమోదైన అర్హులైన వారందరికీ ఇళ్లు కేటాయింపులు జరుగుతాయని ఆయన తెలిపారు. కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, సీనియర్ నాయకులు హరిపట్నాయక్, సన్యాసప్పలనాయుడు, నేపాల్ శ్రీను, దుర్గ, నాయుడు, గణపతి, పైడి నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్సార్ నగర్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కంపా హనోకు

పెన్షనర్ల ధర్నా జయప్రదానికి పిలుపు

మద్దిపాలెం: ఈ నెల 27న జరగనున్న విశాఖపట్నం పోర్టు, డీఎల్‌బీ, పెన్షనర్లు, ఎంప్లాయిస్ ధర్నాను విజయవంతం చేయాలని పెన్షనర్లు పిలుపునిచ్చారు. మాధవధార కళింగనగర్‌లోని పెన్షనర్ల కార్యాలయంలో విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ వద్ద ఈ నెల 27న ధర్నా చేస్తామని వారు తెలిపారు. పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడం విరమించుకోవాలని, పోర్టు ఆస్పత్రిలో పోర్టు డీఎల్‌బీ పెన్షనర్లకు ప్రస్తుతం ఇస్తున్న వైద్య సదుపాయాలు మెరుగు పరచాలని కోరారు. పలు అంశా లు, డిమాండ్ల సాధనకు ధర్నా చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలిపారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పెన్షనర్లు

అలనాటి మేటి చిత్రం శంకరాభరణం



మాట్లాడుతున్న రాంభట్ల నృసింహశర్మ

సీతంపేట: సాహిత్య సురభి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'శంకరా విశ్వనాథా పర' అనే అంశంపై సాహితీవేత్త రాంభట్ల నృసింహశర్మ ప్రసంగించారు. ఈ సభకు వృద్ధుల కల్యాణ రామరావు అధ్యక్షత వహించగా, అతిథులుగా సినీ నటులు ఎస్.కె.మిశ్రో, డాక్టర్ ద్వారం వెంకటకృష్ణ గణేశ త్యాగరాజు విచ్చేశారు. ఈ సందర్భంగా రాంభట్ల మాట్లాడుతూ శంకరాభరణం సినిమా రాక ముందు కథా అంశం, సంగీత ప్రాధాన్యం విషయాలను వివరించారు. పాశ్చాత్య సంగీత పెను తుపానుకు రెపరెపలాడుతున్న సత్సాంప్రదాయ సంగీత జ్యోతిని ఒక్క కాపు కాయడానికి శంకరాభరణం చిత్రం నిర్మించిన మహానుభావులకు పాదాభివందనం చేస్తున్నానన్నారు. శంకరాభరణం శంకర శాస్త్రిగా పేరు గాంచిన జె.వి.సోమయాజులు ఒక గొప్ప సంగీత విద్వాంసుడని, ఆయన సంగీతమంటే చెవి కోసుకునే వాళ్లు చాలా మంది ఉంటారన్నారు. కళలను ఆరాధించే తులసి(మంజు భార్గవి) గురుభావంతో శంకర శాస్త్రిని ఆరాధిస్తుందన్నారు. ఓంకార నాదాను, దొరకునా ఇటువంటి సేవ, బ్రోచేవారెవరురా, శంకరా నాదశరీరాపర, ఏ తీరుగ నను, పలుకే బంగారమై ఇలాంటి ఆణిముత్యాల్లాంటి పాటలు, సంగీత ప్రాధాన్యం గురించి వివరించారు. ఈ చిత్రం తర్వాత దర్శకుడు కె.విశ్వనాథ్ కళాతపస్విగా పేరుపొందారని, గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు తెలుగు చలన చిత్రసీమలో సుస్థిర స్థానం లభించిందని పేర్కొన్నారు.

కలియుగ వెంకన్నకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఎన్నికల అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాఖ విద్య: ఐఎన్‌సీఈ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల నిర్వహణలో ప్రస్తుత పాలక వర్గానికి వత్తాసు పలుకుతున్న ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఐఎన్‌సీఈ, బీఎంఎస్ యూనియన్లు నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న జరగనున్న సహకార ఎన్నికల్లో ప్రస్తుత పాలక వర్గమైన సీఐటీయూ అనుబంధ యూనియన్‌కు మేలు చేసేలా ఎన్నికల అధికారి వ్యవహరిస్తున్నారని ఆరోపించా రు. ఎన్నికల అధికారిని తక్షణమే మార్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిష్పక్షపాతంగా నిర్వహించేలా కలెక్టర్, సహకార శాఖ జిల్లా రిజిస్ట్రార్ జోక్యం చేసుకోవాలని ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు ఎస్.రాజేష్ కోరారు.

కంచరపాలెం రైతుబజార్‌లో అన్నదానం

కంచరపాలెం: మహాశివరాత్రి సందర్భంగా బిల్వపత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కంచరపాలెం రైతుబజార్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.వి.ఎస్.రవి మాట్లాడుతూ వారాంతంలోనూ, ఆయా పర్వదినాల్లో పేదలు, వృద్ధులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 500 మందికి అన్నప్రసాదం అందించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కె.కృష్ణమూర్తి, ట్రస్ట్ సభ్యులు వెంకటరావు, సుబ్బారెడ్డి, కుమారస్వామి, రాజు, రవి, శంకర్‌రాము, నరసింగరావు, సీతారామయ్య, పార్వతి, లక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఉర్రూతలూగించిన మెగా పాటల పోటీలు

సీతంపేట: పద్మ భూషణ్ చిరంజీవి కళాపరిషత్ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన మెగా పాటల పోటీలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. కళాపరిషత్ అధ్యక్షుడు జి.జగదీష్, కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజయవాడతో పాటు పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు పాల్గొని పోటా పోటీగా పాటలు పాడారు. ప్రథమ స్థానంలో పి.రామారావు, ద్వితీయ స్థానంలో కోసూరి రాజు, తృతీయ స్థానంలో అపర్ణ, సాయిబాబా గెలుపొందారు. వీరికి అతిథులు వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, రోటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి జి.ఎస్.రాజు, సినీ నటుడు ధనుంజయ్, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.


విజేతలతో గంట్ల శ్రీనుబాబు, నిర్వాహకులు

త్వరలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గిరిజన విద్యార్థినుల వసతి గృహంలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వసతి గృహానికి చేరుకున్న ఆయన గంటన్నరకు పైగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, వాష్ రూమ్స్, వార్డెన్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్టాక్ ఫైల్స్, మెస్ నిర్వహణను పరిశీలించారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి నిర్వహణ బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఐదేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న వార్డెన్ బదిలీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. బాత్ రూమ్స్‌కు తలుపులు సక్రమంగా లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం వంటి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రవిబాబు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు దిశగా విద్యనభ్యసించాలని సూచించారు. హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రవిబాబు

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 96 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను అందజేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్రమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందజేస్తోంది. ఇందులో భాగంగా శనివారం ఉక్కునగరం ఎంపీ హాలులో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ చేతులు మీదుగా 49 మంది అధికారులు, 49 మంది కార్మికులకు అవార్డులను అందజేశారు. అదే విధంగా ప్రతిభ చూపిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు వీవీ వేణుగోపాలరావు, డీకే మహంతి, బాగ్చీతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

22న ప్రపంచ స్కౌట్ థింకింగ్ డే

మద్దిలపాలెం: స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న స్కౌట్ థింకింగ్ డే నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. ప్రపంచ స్కౌట్ ఉద్యమ నిర్మాత బాడెన్ పావెల్ 1857 ఫిబ్రవరి 22న లండన్‌లో జన్మించారన్నారు. ఆయన జయంతి రోజున ప్రపంచ స్కౌట్ అండ్ గైడ్స్ దినోత్సవంగా జరుపుకోవడంఆనవాయితీగా వస్తోందని ఆయన పేర్కొన్నారు.

జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు పలు అంశాలపై పోటీలు ఏర్పాటు చేశామన్నారు. బీహెచ్‌పీవీ మార్గంలోని సంసిదా ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

108 లింగాలతో ప్రదోషకాల శతరుద్రాభిషేకం

బీచ్‌రోడ్డు : మహా శివరాత్రి సందర్భంగా విశ్వభారత్ మీడియా ఆధ్వర్యంలో 108 లింగాలతో ఆర్.కె.బీచ్‌లో ప్రదోషకాల శతరుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. రుద్ర హవనం, పాశుపత హోమం వంటి విశేష, విశిష్ట పూజలు చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి భక్తుల కోసం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.